

తాడిపత్రిలో కొనసాగిన సిట్ దర్యాప్తు

తాడిపత్రిలో టిడిపి, వైసిపి గ్రూపులు రాళ్లు రువ్వుకున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిట్ అధికారులు

తాడిపత్రి రూరల్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తాడిపత్రిలో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలు, పోలీసుల వైఫల్యంపై దర్యాప్తు చేసేందుకు ఏర్పాటైన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్) శనివారం రాత్రి తాడిపత్రికి చేరుకుంది. సిట్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏసీబీ డీఎస్పీ భూషణం, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జిఎల్.శ్రీనివాస్‌లు శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు దర్యాప్తును కొనసాగించారు. ఓంశాంతినగర్, పాతకోట, గానుగవీధిలో పర్యటించి, స్థానికులతో మాట్లాడారు. ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ ఇళ్ల పరిసర ప్రాంతాలనూ పరిశీలించారు. ఇరువర్గాలు గొడవపడ్డ కళాశాల మైదానంలో కలియతిరిగారు. ఆదివారం ఉదయం పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లలో పలు రికార్డులను పరిశీలించారు.

వార్త మెయిన్‌లో

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. అక్రమాల నియంత్రణకు అధికారులకు సర్వహక్కులూ ఉన్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులందరినీ అధికారులు ఒకేలా చూడాల్సి ఉంది. హిందూపురంలో మాత్రం అధికార పార్టీ నేతలకు అధికారులు సలాం కొడుతున్నారు. దీనికి నిదర్శనం గత కొంత కాలంగా హిందూపురం పట్టణ సమీపంలోని పెన్నా నదిలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టి పగలూ రాత్రి అన్న తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. ఇది పెద్ద ఎత్తున ఇసుక తరలిపోతున్నా ఇటు సెబ్ అధికారులు అటు రెవెన్యూ అధికారులు ఏ ఒక్కరూ కూడా వీరిపై చర్యలు తీసుకోకపోవడమే దీనికి నిదర్శనం. ఎవరూ పట్టించుకోకపోవడంతో పెన్నాలో ఇసుక లూటీ యథేచ్ఛగా కొనసాగుతోంది.

ఎవరూ... పట్టించుకోలేద(పె)న్నా..!

- పక్కాగా పెన్నా లూటీ..!
- 'ప్రతిమ' పేరుతో ఇసుక తరలింపు
- జిల్లా అధికారులు పర్యటిస్తున్నా పట్టించుకోని పరిస్థితి
- శాఖల మధ్య సమన్వయలోపం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ఉన్న పెన్నా నది పరివాహక ప్రాంతంలో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ పేరుతో బిల్లులు సృష్టించి అధికార పార్టీకి చెందిన హిందూపురం రూరల్ మండలం ఓ ప్రజాప్రతినిధి, సోదరుడి కుమారుడు, సోదరులు, అధికార పార్టీకి చెందిన మరి కొంతమంది కలిసి పదుల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టుకుని పెన్నా నదిలో ఇసుకను తోడేస్తున్నారు. పగలు పట్టణం, రాత్రి సమయాల్లో కర్నాటకకు తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. సంపాదిస్తున్నారు. ప్రజాశక్తి క్షేత్ర పరిశీలనకు వెళ్లి నదిలో ఇసుక తోడుతున్న వారితో అనుమతులు ఉన్నాయా అని అడిగితే విజయవాడకు చెందిన ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ వారు అందించిన బిల్లును చూపించారు. ఆ బిల్లు రూ.2500 చెల్లించినట్లు ఉంది. ఉదయం 7:30 గంటల నుంచి కొంత మందికి, మధ్యహ్నం 1.40 వరకు మరి కొంత మందికి సాయంత్రం 5:30 వరకు పెన్నా నది నుంచి ఇసుకను తరలించడానికి అనుమతులు ఇచ్చినట్లు ఉంది. ఈ బిల్లు ఒక లోడ్‌కు ఇచ్చారా...? ఒకరోజు మొత్తానికి ఇచ్చారా....? అన్న దానిపై స్పష్టత లేదు. ఇసుక రీచ్ నిబంధనల మేరకు రీచ్‌ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి, జెసిలతో క్యూబిక్ మీటర్ లేదా ఇన్ని టన్నులు ఇస్తున్నట్లు నమోదు చేసి దూరాన్ని బట్టి బిల్లులో సమయం వేసి ప్రతి లోడ్ కు బిల్లు ఇస్తారు. అలా కాకుండా పెన్నా నది పరివాహక ఇసుక రీచ్‌లో రోజు మొత్తానికి ఒకే బిల్లుతో ఇసుక రవాణా జరుగుతుంది. ఇసుకను నింపుతున్న వారిని బిల్లు ఎక్కడ ఇస్తారని అడిగితే వారు దీనిపై సమాధానం ఇవ్వడం లేదు. ఈ ఇసుక తరలింపు వెనుక అధికార పార్టీకి చెందిన ముఖ్య నేత సోదరుడు ఉన్నట్లు తెలుస్తోంది. అక్రమ ఇసుక రవాణాను అధికార పార్టీ నేతల కనుసనల్లో జరుగుతుండడంతో అధికారులు చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

శాఖల మధ్య సమన్వయలోపం

ఇసుక అక్రమ తరలింపుపై ఆయా శాఖల మధ్య సమన్వయ లోపం కన్పిస్తోంది. ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకునేలా వ్యవహరిస్తున్నారు. ఇసుక తరలింపుపై తమకు ఏమీ తెలియదని, రీచ్‌లకు సంబంధించి కార్యాలయం నుంచి ఎటువంటి ప్రత్యుత్తరాలు జరపలేదని, ఈ విషయాలను మైన్స్ అధికారులు చూస్తున్నారంటూ హిందూపురం తహశీల్దార్ శివప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. ఈ విషయంపై సెబ్ అధికారులకు వివరణ కోసం ప్రయత్నించగా స్థానిక సెబ్ సిఐ మూడు రోజులుగా అందుబాటులోకి రాలేదు. పోలీసులు అయితే అడపాదడపా ఒకటి రెండు ట్రాక్టర్లను అలా పట్టుకుని ఇలా వదిలి వేస్తున్నారన్నా విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఎటువంటి అనుమతులు పొందకుండానే బిల్లును సృష్టించి ప్రతిమ పేరుతో ఇసుకను అధికార పార్టీకి చెందిన నాయకులు లూటీ చేస్తున్నారనది మాత్రం స్పష్టంగా తెలుస్తోంది. పెన్నా నదిలో ఇసుకను ఎడాపెడా లూటీ చేస్తుండడంతో చుట్టుపక్కన ఉన్న రైతన్నలు లబోదిబోమంటున్నారు. ఎవరికి ఫిర్యాదు చేసిన ఏ ఒక్కరు కూడా వారిపై చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దష్టి సారించి దానిని నియంత్రించే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెన్నా నది నుంచి ట్రాక్టర్లలో తరలిపోతున్న ఇసుక (ఇన్‌సెట్‌లో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో ఇచ్చిన బిల్లు)

అధికారుల్లో గుబులు

- తప్పు చేస్తే దండన తప్పదు
- ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇదే తీరు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



ఎన్నికల ప్రక్రియలో ఏ మాత్రం తప్పు చేసినా అధికారులపై వేటు పడుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఒకరి తరువాత ఒకరిపై వేటు పడుతూనే ఉంది. ఓటర్ల జాబితా తయారీ మొదలు ఓటింగ్ పూర్తయ్యే వరకు అధికారులపై వేటు పడిన ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. ఓటర్ల జాబితాలో తప్పులు చేసారన్న దానిపై ఇది వరకే ఇద్దరు జిల్లా అధికారులపై వేటు పడింది. ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో ఓటర్లను దురుద్దేశంతో తొలగించారన్న ఆరోపణలపై అధికార వైసిపి, ప్రతిపక్ష టడిపిలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడమే కాకుండా ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు అందజేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఎన్నికల సంఘం ఇద్దరు జిల్లా ఉన్నతాధికారులపై వేటు వేసింది. జిల్లా పరిషత్ సిఇఒలు స్వరూప రాణి, భాస్కర్‌రెడ్డిలపై వేటు వేశారు. వీరే కాకుండా విఆర్‌ఎలపైనా వేటుపడింది. ఈ క్రమంలోనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నారన్న ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్‌లపైనా బదిలీ వేటు పడింది. ఇక కొత్త అధికారులు కాబట్టి సజావుగా ఎన్నికలు సాగుతాయని అనుకున్నారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలయ్యాక డీఎస్పీ రాఘవరెడ్డిని బాధ్యతల నుంచి తప్పించారు. తాడిపత్రిలో మూడు రోజులపాటు ఎన్నికల సమయంలో ఘర్షణ చోటు చేసుకోవడంతో ఏకంగా జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ బదిలీకావల్సి వచ్చింది. డిఐజి అమ్మిరెడ్డి సైతం బదిలీ అయ్యారు. ఆయన్ను సస్పెండ్ చేయడమే కాకుండా విచారణకు ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈయనతోపాటు తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, సిఐ మరళీకృష్ణపైనా వేటు పడింది. ఈ వేటు ఇంకా మరికొంత మంది కింది స్థాయి అధికారులపైనా వేటు పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రత్యేక విచారణ బృందం రెండు రోజులుగా తాడిపత్రిలో మకాం వేసి పూర్తి స్థాయి విచారణను చేపట్టింది. ఈ విచారణ నివేదిక ఆధారంగా కేసులు కూడా ఉండే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఇలా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఒకరి తరువాత ఒకరిపై వేటు పడుతూనే వస్తోంది. ఎన్నికల ప్రక్రియ ఇంకా తుది ఘట్టం ఉండనే ఉంది. ఓట్ల లెక్కింపు జరగాల్సి ఉంది. అది వచ్చాక జిల్లాలో చోటు చేసుకునే పరిణామాలు ఉండనున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో అధికారుల్లో గుబులు నెలకొంది. ఎక్కడ ఏ తప్పు జరిగితే చర్యలుంటాయోనని భయపడిపోతున్నారు. ఇప్పుడు జిల్లా కలెక్టర్ మొదలు డిఐజి, ఎస్పి అంతా కొత్తవారే వచ్చారు. ఎన్నికల ఫలితాల అనంతరం పరిణామాలను ఈ కొత్త అధికార యంత్రాంగం ఏ రకంగా వ్యవహరించనుందన్నది చూడాల్సి ఉంది. ఏ మాత్రం చిన్న తప్పు జరిగినా ఇబ్బందులు పడుతామని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలో పది మంది అధికారులు ఈ రకమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నువ్వా..నేనా అన్నట్టుగా సాగిన ఈ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ఉన్నారు. ఈ పోరులో నలుగుతున్నది మాత్రం అధికారులే. మొత్తం మీద అడకత్తెరలో పోకచెక్కలాగా తయారయ్యింది వీరి పరిస్థితి.

కౌంటింగ్‌ను ప్రశాంతంగా నిర్వహిస్తాం

- శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు
- ఎస్పీ గౌతమి శాలి
- జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ

బాధ్యతల స్వీకరణ సందర్భంగా పోలీసు గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ గౌతమిశాలి

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ గౌతమి శాలి

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

అనంతపురం జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్‌ను ఎలాంటి శాంతిభద్రతల సమస్య రానీయకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని జిల్లా నూతన ఎస్పీ గౌతమిశాలి తెలియజేశారు. ఎస్పీగా ఆమె ఆదివారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ కాన్ఫరెన్స్ హాలులో మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ప్రశాంతత లోపించకుండా శాంతిభద్రతలను పరిరక్షించడానికి కార్యాచరణ ప్రణాళికలతో ముందుకెళ్తామన్నారు. అన్నివర్గాల ప్రజల సహకారం తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో మాట్లాడి మెరుగైన పోలీసింగ్‌కు కషి చేస్తామన్నారు. సెన్సిటివ్ గ్రామాలు, బైండోవర్లు... ఇలా ఏదైనా చట్టపరంగా ముందుకెళ్తామన్నారు. ఎన్నికల నియమ నిబంధనల మేరకు స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్టంగా మూడంచెల భద్రత కొనసాగుతోందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సందర్భంగా ఎలాంటి హింస, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

మూడంచెల భద్రతను మరింత బలోపేతం చేయండి

పోల్డ్ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను ఎస్పీ గౌతమిశాలి పరిశీలించారు. కేరళ సాయుధ స్పెషల్ పోలీసులు, ఏఆర్ సాయుధ పోలీసులు, సివిల్ పోలీసులు మూడంచెల భద్రత నిర్వహిస్తుండటాన్ని సమీక్షించి మరింత బలోపేతం చేయాలన్నారు. పార్కింగ్ స్థలాన్ని స్ట్రాంగ్ రూంలకు దూరంగా ఏర్పాటు చేయాలన్నారు. అన్ని గేట్లలోను సిబ్బందిని బందోబస్తుకు నియమించాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలు, హింసకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి (ఏఆర్), అనంతపురం డీఎస్పీ టివివి.ప్రతాప్, ఎఆర్ డీఎస్పీ మునిరాజ, సిఐలు జాకీర్ హుస్సేన్, ఇందిర, రెడ్డెప్ప, ప్రతాప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

గుంతకల్లు హంపిరెడ్డి భవనంలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

సుందరయ్య పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఘన నివాళి

ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన పుచ్చలపల్లి సుందరయ్య పోరాట స్ఫూర్తి అనుసరణీయమని, ఆయన వారసత్వాన్ని కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సిపిఎం, ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. మెట్టమొదటి పార్లమెంట్ ప్రతిపక్ష నేత, దక్షణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమాలను సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆదివారం నాడు నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో సుందరయ్య ప్రజా పోరాటాలను నాయకులు వివరించారు. చిన్న వయస్సులోనే బ్రిటీష్‌వారిని వ్యతిరేకించి, ఆంధ్రరాష్ట్రంలో ఉప్ప సత్యగ్రహానికి నాయత్వం వహించిన నేత సుందరయ్య అన్నారు. వ్యక్తిగత ఆస్తిని ప్రజలకు పంచి పెట్టిన త్యాగమూర్తి అన్నారు. సాధారణ వ్యక్తిగా పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. ఆయన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని సోషలిజం సాధించే కృషిలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పట్టుదలగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

వార్త 6లో

సబ్ జైలు నిర్వహణ ఇలానా..?

- పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు
- జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ ఆగ్రహం
- హెడ్ వార్డర్‌పై చర్యలకు సిఫార్సు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం సబ్‌జైలును తనిఖీ చేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

హిందూపురం సబ్ జైలు నిర్వహణ తీరుపై జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖైదీలకు ఇవ్వాల్సిన గుర్తింపు కార్డులు, దస్త్రాల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యంపై జైలు సూపరింటెండెంట్ అంజి నాయక్‌పై అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా జడ్జితో పాటు స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సబ్ జైలును తనిఖీ చేశారు. తొలుత సబ్ జైలులో ఉన్న ఖైదీల వివరాలను జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలకు ఇవ్వాల్సిన గుర్తింపు కార్డు విషయంలో నిర్లక్ష్యంపై సంబంధిత హెడ్ వార్డర్ రామాంజినాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జైలు గదులను, మరుగుదొడ్లను జిల్లా న్యాయమూర్తి పరిశీలించారు. ఖైదీలకు ఆహార పదార్థాలు వండేందుకు సరఫరా చేస్తున్న నిత్యావసరాలు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. మంచినీటి సదుపాయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జైలు గదుల్లో లైటింగ్, ఫ్యాన్ సదుపాయాలు ఉన్నాయా.. లేదా.. అన్న విషయాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలు ఒక్కొక్కరితో ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు... ఎప్పటి నుంచి జైలులో ఉంటున్నారు... న్యాయవాది ఉన్నారా.. లేదా..? అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సబ్ జైల్లో పనిచేస్తున్న మరో హెడ్ వార్డర్ హరినాథ్ విధులకు మద్యం సేవించి వచ్చినా ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోలేదని సూపరింటెండెంట్ అంజి నాయక్‌ను ప్రశ్నించారు. చర్యలు తీసుకున్నట్లు ఎలాంటి ఆధారాలు ఉన్నాయని జిల్లా న్యాయమూర్తి అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. దస్త్రాల నిర్వహణలో ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, క్రమశిక్షణ వత్తి పట్ల అంకితభావం లేకపోవడం వల్లే ఇలా వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఒక దశలో సస్పెన్షన్‌కు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు. దీనికి తోడు ఉద్యోగుల హాజరు పుస్తకంలో కూడా సక్రమంగా సంతకాలు లేకపోవడం పట్ల జిల్లా న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన ఉద్యోగి ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోసారి తాను ఈ జైలును ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఏమైనా పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. మద్యం సేవించి విధులకు హాజరవుతున్న హెడ్ వార్డర్ హరినాథ్‌పై చర్యలకు సిఫార్సు చేయనున్నట్లు జిల్లా న్యాయమూర్తి తెలిపారు. సంబంధించిన పూర్తి వివరాలను సోమవారం సాయంత్రం అనంతపురం తీసుకురావాలని జిల్లా అధికారికి ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ జైలులో ఏమైనా సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకురావాలని సూచించారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని నిందితులు ఎవరైనా ఉంటే వివరాలు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కోర్టుల సూపరింటెండెంట్‌లు భాస్కర్, రాధాకష్ణ, రామాంజనేయులు, లోక్ అదాలత్ హేమావతి పాల్గొన్నారు.

పెనుకొండ సబ్‌జైలు తనిఖీ

పెనుకొండ : అనంతపురం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్, ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి.శ్రీనివాస్ పెనుకొండ సబ్ జైలును ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ జైలులోని ఖైదీల గదులు, మరుగుదొడ్లు, వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. జైలు రికార్డులను తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.బుజ్జప్ప, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్, సబ్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.అజ్గర్ హుస్సేన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

యోగాను క్రీడగా గుర్తించడం సంతోషకరం

విశ్రాంత జిల్లా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.శివశంకర్

ప్రజాశక్తి-అనంతపురం

మాట్లాడుతున్న విశ్రాంత జిల్లా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.శివశంకర్

యోగాసనాలపై పిల్లల్లో ఆసక్తి కలిగించేందుకు యోగాసనను ఒక క్రీడగా గుర్తించడం ఆనందించదగ్గ విషయమని విశ్రాంత జిల్లా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.శివశంకర్ అన్నారు. నగరంలోని వేమన టెలిఫోన్ భవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా యోగాసన న్యాయమూర్తి శిక్షణ పొందిన వారికి దిశానిర్దేశం చేశారు అనంతపురం యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకూ రాష్ట్రస్థాయి జడ్జిలకు ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బి బాలగంగాధర్‌రెడ్డి, అడ్వకేట్ పి.గురుప్రసాద్, అనంతపురం క్లబ్ కార్యదర్శి పి.కేశవరెడ్డి, యోగా గురువులు దివాకర్, మారుతీప్రసాద్, తారక రామయ్య, దాదులూరయ్య, యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు రాధిక, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి కరిబండి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీలు రమణ, రీసోర్స్‌పర్సన్లు శ్రీధర్‌రెడ్డి, నిర్మలారెడ్డి, అనిల్, ట్రైనీ జడ్జిలు పాల్గొన్నారు.

ముగిసిన చెస్ కోచింగ్ క్యాంప్

ప్రజాశక్తి-అనంతపురం

సైమల్టేనియస్ మ్యాచ్ ఆడుతున్న ఇంటర్నేషనల్ మాస్టర్ సాయి అగ్ని జీవితేష్

అనంతపురంలోని సాయినగర్ 2వ క్రాస్‌లో ఉన్న ఏ1 ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించిన ఇంటర్నేషనల్ మాస్టర్ సాయి అగ్ని జీవితేష్ ఇంటెన్సీవ్ చెస్ కోచింగ్ క్యాంపు ఆదివారం విజయవంతంగా ముగిసింది. మొదటి నాలుగు రోజులు చదరంగానికి సంబంధించిన వివిధ అంశాల్లో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. చివరి రోజు ఇంటర్నేషనల్ మాస్టర్ సాయి అగ్ని జీవితేష్ 8 మంది క్రీడాకారులతో కూడా సైమల్టేనియస్ మ్యాచ్ (ఏక కాలంలో ఒక క్రీడాకారులు మిగిలిన అందరికీ క్రీడాకారులతో) ఆడగా, ఏడు మ్యాచ్‌లు సాయి అగ్ని జీవితేష్ గెలిచారు. కేవలం ఒక క్రీడాకారుడు కౌశిక్ చిల్లాతో జరిగిన గేమ్ మాత్రం డ్రాగా ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ శిబిరం నిర్వాహకులు ఇంటర్నేషనల్ ఆర్బిటర్ ఉదయ్‌కుమార్ నాయుడు జిల్లాలో ఉన్న చదరంగం క్రీడాకారులు ఇలాంటి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగంగా ఉంటాయన్నారు. అంతేగాకుండా చదరంగం ఆట మెలకువలను మరింత మెరుగుపరుచుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాన్స్ మాస్టర్ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అందనంత దూరంలో 'ఆహ్లాదం'

గుత్తిలో పార్కుల అభివృద్ధిలో నిర్లక్ష్యం
ఉన్నది ఒక్కటే..అందులోనూ సౌకర్యాలు నిల్..
ఉసూరుమంటున్న పట్టణవాసులు



గుత్తిలోని పార్కు

అపరిశుభ్రత మధ్య ఆడుకుంటున్న చిన్నారులు

ప్రజాశక్తి-గుత్తి

ఉరుకులు.. పరుగుల జీవనంలో పట్టణ ప్రజలను కాసింత సేదతీర్చి, ఉల్లాసాన్ని ఇచ్చేవి పార్కులే... అలాంటి పార్కుల అభివృద్ధి, నిర్వహణ బాధ్యత చేపట్టాల్సిన స్థానిక పురపాలక సంఘాలు తగిన శ్రద్ధ చూపటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గుత్తి పట్టణంలో పార్కుల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. 15 ఏళ్ల కిందట ఉప్పరగేరిలో పురాతన బావి (కుక్కల బావి)ని పూడ్చివేసి అక్కడ పార్కు ఏర్పాటుకు పురపాలిక అధికారులు టెండర్ల ద్వారా గుత్తేదారుకు అప్పగించారు. తొలుత రూ.7లక్షలతో పనులు చేపట్టారు. తర్వాత రూ.5 లక్షల వెచ్చించి పనులు చేశారు. అయితే అరకొరగానే పనులు చేయటంతో పార్కు అసంపూర్తిగా నిలిచిపోయింది. పట్టణంలో పురపాలిక ఆధ్వర్యంలో ఒక్కపార్కు కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో ప్రజలు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. స్థానిక అంబేద్కర్ నగర్‌లో 35 ఏళ్ల కిందట రెండెకరాల్లో పార్కును ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు స్థలాన్ని సేకరించి ఉంచారు. ఆ స్థలంలో కొన్నేళ్ల తర్వాత ఇళ్లు వెలిశాయి. పట్టణంలో పార్కు ఏర్పాటుకు ఎంతో అనువుగా ఉన్న స్థలం కబ్జాకు గురైంది. తర్వాత రెవెన్యూ అధికారులే ప్రజలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. దీంతో పార్కుల ఏర్పాటుకు పట్టణంలో అనువైన ప్రభుత్వ స్థలాలే లేవు. ప్రస్తుతం ఉప్పరగేరిలో పార్కు ఏర్పాటు పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. 15 ఏళ్ల కిందట కిందట చేపట్టిన పనులు నేటికీ పూర్తి కాలేదు. పార్కులో బెంచీలు, జిమ్, చిన్నపిల్లలు ఆడుకునేందుకు వీలుగా జారుడు బండ ఏర్పాటు చేశారు. ఇంకా పనులు చేయాల్సి ఉంది. ఐదేళ్ల క్రితం నేమితాబాద్ రోడ్డులో పది ఎకరాల్లో పార్కును ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. రూ.1.20కోట్లు వెచ్చించాలని తీర్మానించారు. పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రావటం లేదని నెపంతో పనులు ప్రారంభం కాలేదు. పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో గుత్తి ఆర్.ఎస్‌లో అంబేద్కర్ పార్కు ఉంది. చిన్నదైన దీన్ని రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు నిర్వహిస్తున్నారు. గుత్తిలో పార్కులు లేక చిన్నారులు, యువకులు, ప్రజలు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. వారాంతాలు, సెలవుల్లో ఉద్యోగులు తమ పిల్లలతో కలిసి సేదతీరేందుకు అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికైనా పురపాలక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి పట్టణవాసులు సేద తీరేందుకు ఉద్యానవనాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారం

పార్కులు ఏర్పాటు చేయాలి

గుత్తి, గుత్తి ఆర్.ఎస్.ల్లో పురపాలక అధికారులు పార్కులను ఏర్పాటు చేయాలి. విస్తీర్ణంలో జిల్లాలోనే పెద్దదైన గుత్తి పురపాలికలో పార్కులు లేకపోవడం బాధాకరం. తద్వారా ప్రజలు, పిల్లలకు ఆహ్లాదం కరవవుతోంది. అధికారులు పురపాలిక రిజర్వుడు స్థలాల్లో పార్కులను ఏర్పాటు చేయాలి.

జి.కొండప్ప, విశ్రాంత ఉద్యోగి, గుత్తి.

పిల్లల పార్కును అభివృద్ధి చేయాలి

పట్టణంలోని పిల్లల పార్కు చెత్తాచెదారంతో నిండి ఉంది. దీనికితోడ రాత్రి సమయంలో మద్యంప్రియులకు నిలయంగా మారింది. అపరిశుభ్రంగా ఉండడంతో పార్కు రావడానికి పిల్లలు శ్రద్ధ చూపడం లేదు. పిల్లలు సేద తీరేందుకు పార్కును అభివృద్ధి చేయాలి.

తన్నీరు శ్రీనివాసులు, బీసీ కాలనీ, గుత్తి.

కాంగ్రెస్‌లో ఉంటూ ఆరోపణలు చేయడం బాధాకరం

విలేకరులతో మాట్లాడుతున్న డిసిసి ఉపాధ్యక్షులు వడ్ల ఆంజనేయులు

వజ్రకరూరు : దశాబ్దాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీలో ఉంటున్న కొందరు పార్టీ పట్ల అనుచిత వ్యాఖ్యలు, ఆరోపణలు చేయడం అర్థరహితమని అలాంటి వారిపై పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవాలని డిసిసి ఉపాధ్యక్షులు వడ్ల ఆంజనేయులు కోరారు. ఆదివారం ఉరవకొండలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పదవులను అనుభవిస్తున్న కొందరు నాయకులు అధిష్టానం ఆదేశాల మేరకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీలో ఉన్న కొందరిపై అర్థరహితమైన, నిరాధారమైన ఆరోపణలు చేస్తూ విమర్శలు చేయటం తగదని హితవు పలికారు. బరిలో ఉన్న అభ్యర్థులు కనీసం ఏజెంట్లను నియమించుకోలేదని, పెద్దఎత్తున సమర్పించి పార్టీ టికెట్లు పొందినట్లు విమర్శలు చేయటం సరికాదని విమర్శించారు. ఇలాంటి వ్యక్తుల పట్ల పార్టీ అధిష్టానం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతేగాకుండా అలాంటి వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబిసి కార్యదర్శి రేగటి చెన్నప్ప, జిల్లా కార్యదర్శి ఇంద్రావతి ఓబులేసు, వజ్రకరూరు మండల కన్వీనర్ శ్రీకాంత్‌వర్మ పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి (సోమవారం) ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న కలశస్థాపన, స్వస్తివచనం, రక్షాబంధనం, 21న ధ్వజారోహణం, సింహ వాహనోత్సవం, 22న సూర్యప్రభ వాహనం, 23న శేష వాహనోత్సవం, 24న హనుమద్ వాహనం, 25న శ్రీవారి కల్యాణం, సాయంత్రం గరుడ వాహనోత్సవం, 26న గజేంద్ర వాహనోత్సవం, 27న ఉదయం మడుగుతేరు, సాయంత్రం బ్రహ్మ రథోత్సవం, 28న పార్వేటోత్సవం, అశ్వవాహనోత్సవం, బాణాసంచా వేడుక, 29న వసంతోత్సవం, కంకణ విసర్జన, చక్రస్నానం, సాయంత్రం మయూర వాహన ఉత్సవం, 30న రాత్రి సప్త ప్రాకారోత్సవం, శయనోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పామిడి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2006–2008లో ఇంటర్మీడియట్ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 16ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇందులో భాగంగా నాడు కళాశాలలో గడిపిన మధుర స్మృతులు, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. అనంతరం నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సాదరంగా ఆహ్వానించారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా కళాశాల ప్రాంగణంలో అడుగుపెడుతూనే హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు ప్రభాకర్, ఆదినారాయణ, రామాంజినేయులు, రాజన్న, ఓబిలేసు, తదితరులు మాట్లాడుతూ 16ఏళ్ల తర్వాత తమను పిలిపించి ఇంతటి తీపి జ్ఞాపకాలను తిరిగి ఆస్వాదించేలా చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తమవంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.

భట్రాజు కుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

పురస్కారాలు అందుకుంటున్న విద్యార్థులు

అనంతపురం కలెక్టరేట్ : 2023–2024 విద్యా సంవత్సరం పది, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఉమ్మడి అనంతపురం జిల్లాలోని భట్రాజు కుల విద్యార్థులకు భట్రాజు హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆదివారం అనంతపురం నగరంలోని శారదా నగర్‌లో స్వామి వివేకానంద ధ్యాన మందిరంలో అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సేవారత్న అవార్డు గ్రహీత రత్నాకరం అంబజేయరాజు, విద్యారత్న అవార్డు గ్రహీత పాలగిరి శ్యామసుందరరాజు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భట్రాజు హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు ఆంజనేయులు, అబ్బరాజు నారాయణరాజు, కమిటి సభ్యులు శ్యామసుందర్ రాజు, అక్కిరాజు ఉమాదేవి హాజరయ్యారు.

అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డే

గుత్తిలో ఎయిడ్స్ మృతులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

గుత్తి : స్థానిక హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గుత్తిలో అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో ఉన్న హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో సిబ్బంది కొవ్వొత్తులు వెలిగించి ప్రపంచ వ్యాప్తంగా హెచ్ఐవి/ఎయిడ్స్ తో మరణించిన వారికి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఐ ప్రాజెక్టు జి.రమేష్, ఎంఇఎ సందీప్ కుమార్, ఓఆర్‌డబ్ల్యులు డి.కృష్ణవేణి, ఎస్.శంషాద్,జి.రాధాకుమారి, లావణ్య, జ్యోత్స్న, పీఈలు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : అంతర్జాతీయ ఎయిడ్స్ కాండిల్ లైట్ డే సందర్భంగా ఎపిఎస్ఎసిఎస్, డిఎపిసియు ఆధ్వర్యంలో మాస్ ఎడ్యుకేషన్, ప్రభుత్వ ఆసుపత్రి ఐసీటీసీ విభాగం సిబ్బంది ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా హెచ్ఐవి ఎయిడ్స్, బారిన పడి చనిపోయిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ విభాగం కృష్ణమూర్తి, అల్తాఫ్, మాస్ ఎడ్యుకేషన్ మేనేజర్ నీలకంఠ, అకౌంటెంట్ లోకేష్, అభిషేక్, మాస్ ఎడ్యుకేషన్ సిబ్బంది సుధ, మంగళమ్మ, లక్ష్మి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నేటి నుంచి 'పెన్నహోబిలం' బ్రహ్మోత్సవాలు

ఈవో విజయ్‌కుమార్

పెన్నోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

ప్రజాశక్తి-ఉరవకొండ టౌన్

జిల్లాలో ఉరవకొండ వద్ద వెలసిన పెన్నహోబిలం శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి బ్రహ్మోత్సవలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 31వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఈసందర్భంగా ఆలయ ఈవో విజయ్ కుమార్, ఆలయ అర్చకులు ద్వారకానాథ్, బాలాజీ స్వామిలు బ్రహ్మోత్సవాల విశేషాలను తెలియజేశారు. 20వ తేదీ సోమవారం అమిద్యాల గ్రామం నుంచి పెన్నోబిలంకు మేళతాళాల మధ్య ఉత్సవ విగ్రహాలను తీసుకురానున్నట్లు తెలియజేశారు. 21న ఉదయం ధ్వజారోహణం అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 28న బ్రహ్మరథోత్సవం జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు, విద్యుత్, పరిశుభ్రత తదితర అంశాలపై ఆలయ సిబ్బందితో సమన్వయం చేసుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా వసతులు కల్పిస్తామన్నారు.

హైమాక్స్ లైట్లు వెలుగులో ఆలయం

పెన్నోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ప్రాంగణం చుట్టుపక్కల హైమాక్స్ లైట్లను ఇటీవల అనంతపురం కెనరా బ్యాంక్ రూ.1.71 లక్షల సహకారంతో వీటిని ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో విజయ్ కుమార్ తెలిపారు. హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేయడం వల్ల రాత్రి సమయాల్లో ఆలయ తూర్పు, ఉత్తర ముఖద్వారాల వైపు వెలుగు సంతరించుకుందన్నారు. దాతల సహకరిస్తే భవిష్యత్తులో ఆలయం వద్ద మరిన్ని అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు.

పెన్నోబిలంలో చూడదగిన ప్రదేశాలు

పెన్నోబిలం వద్ద చూడదగని ప్రాంతాలు అనేకం ఉన్నాయి. లక్ష్మమ్మకోనేరు, అక్కడ ఉన్నరెండు జలపాతాలు, చెట్లతొర్రలనుంచి వచ్చేనీరు, అందంగా నిర్మించిన పాలగోపురం భక్తులను సందర్శకులను ఎంతో ఆకర్షిస్తుంది. ఒకవైపు పుణ్యక్షేత్రంగా, మరో వైపు పర్యాటక క్షేత్రంగా పెన్నబిలం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోందని ఈవో తెలియజేశారు.

సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తాం

మల్లు స్వరాజ్యం నగర్‌లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం 1వ నగర కమిటీ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్వాతంత్ర్య సమరయోధులు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం నాయకులు స్పష్టం చేశారు. సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని సిపిఎం 1వ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మల్లు స్వరాజ్యం నగర్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం 1వ నగర కమిటీ కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ సుందరయ్య స్ఫూర్తిదాయక విధానాలకు నేడు దేశంతోపాటు రాష్ట్రంలో ఆవశ్యకత పెరిగిందన్నారు. అంతేగాకుండా ఆయన విశాలాంధ్రలో రాసిన ప్రజారాజ్యం పుస్తకం తెలుగు ప్రజల హృదయ స్పందనగా మారిందన్నారు. అప్పుడు ఆయన రాసిన పుస్తకమే ఇప్పుడు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. 1951 ప్రథమ పార్లమెంటులో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా అవతరించి ప్రతిపక్ష పార్టీ నాయకులుగా సుందరయ్య ఎన్నో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సుందరయ్య జన్మస్థలమైన అలగానిపాడు నుంచి వచ్చిన సురేష్ ఆ గ్రామంలో సుందరయ్య చేసిన ఆదర్శమైన పనులను వివరించారు. తర్వాత సుందరయ్య స్ఫూర్తితో కమ్యూనిస్టు విలువలను కాపాడుతామని, శ్రామిక, కార్మిక వర్గ ఐక్యత కోసం పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిసిఎం నగర నాయకులు ప్రకాష్, వెంకటనారాయణ, మసూద్, బాలకృష్ణ, గఫూర్, వెంకటేష్, రాజీవ్ కాలనీ మాజీ సర్పంచి హుస్సేన్, అంజి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, కాలనీ నాయకులు డేవిడ్, భీమేష్‌కుమార్, హరి, శంషాద్, మాబున్నీ, ఫక్రుని, మోహన, వలి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే జిల్లాకేంద్రంలోని ప్రజాశక్తి దినపత్రిక కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎడిషన్ మేనేజర్ ఎన్.వేణుగోపాల్, ఎడిషన్ ఇన్‌ఛార్జి శివప్రకాష్, సిబ్బంది డేవిడ్, సుధాకర్, కేశవ్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : స్వాతంత్ర్య సమరయోధులు, పేదల పక్షపాతి, విప్లవకారుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ శివారులో ఉన్న జెడ్ వీరారెడ్డి కాలనీలో చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, పట్టణ కార్యదర్శి వి.నిర్మల మాట్లాడుతూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కవిత, పద్మావతమ్మ, వెంకటలక్ష్మి, దేవి, అలివేలమ్మ, లక్ష్మీదేవి, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి దినపత్రిక కార్యాలయంలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

సిపిఎం ఆధ్వర్యంలో నివాళి

పామిడిలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

వజ్రకరూరు : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఉరవకొండలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సుందరయ్య ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, నాయకులు మురళి, మహాలక్ష్మి, బాషా, మోహన్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా రాయదుర్గంలోని సమైక్యాంధ్ర భవనంలో సిపిఎం నాయకులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాల సాధనకు నిరంతరం పార్టీ నాయకత్వం కృషి చేస్తోందన్నారు. అదేవిధంగా ఆయన గొప్ప పార్లమెంటేరియన్ అని కొనియాడారు. 17 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, ఐదేళ్లపాటు ఎంపీగా పని చేశారన్నారు. అంతేగాకుండా శాసనసభ, పార్లమెంటుకు సైకిల్‌పై వెళ్లిన గొప్ప మహనీయ సుందరయ్య అన్నారు. ప్రజాప్రతినిధిగా కార్మిక, రైతు, వ్యవసాయ, కార్మికుల సమస్యలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కమిటీ సభ్యులు మల్లికార్జున, నాయకులు నాగరాజు, మధు, రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివ, ఓబులేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సిపిఎంతోపాటు అనుబంధ ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ దివంగత కామ్రేడ్ సుందరయ్య నెల్లూరు జిల్లా అలగనపాడులో 1913 మే 1న జన్మించారన్నారు. ఆయన చిన్న వయస్సు నుంచే కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం కోసం జరుగుతున్న పోరాటంలో పాల్గొన్నారన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న వివక్షత, అవమానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. అనంతరం కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులై కుల వివక్షతను వ్యతిరేకిస్తూ, వ్యవసాయ కూలీలను సంఘటితం చేసి కూలి రేట్లు పెంచాలని, ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం, భూమి, ఇల్లు అందించాలని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, సాకే నాగరాజు, రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, చంద్రశేఖర్, ఓబులేసు, అబ్దుల్లా, సూరి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పామిడి : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మల్లేష్ అధ్యక్షతన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ప్రతి ఒక్క రాజకీయ నాయకుడికీ ఆదర్శం కావాలన్నారు. ముఖ్యంగా యువతరానికి ఆయన ఒక స్ఫూర్తిదాయకమన్నారు. రాజకీయమంటే ప్రజాసేవ అని నిరూపించిన వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. అంతేగాకుండా సమ సమాజం, కార్మికవర్గం హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలు చేశారన్నారు. కార్మికవర్గం బానిస సంకెళ్ల నుంచి విముక్తి చెందినప్పుడు, సమాన పనికి సమాన వేతనం, రైతాంగానికి గిట్టుబాటు ధర సాధించగలిగినప్పుడు, వ్యవసాయ కార్మికులకు కనీస గిట్టుబాటు కూలీ దొరికినప్పుడు నిజమైన నివాళి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముత్యాలు, బాబా ఫక్రుద్దీన్, ఈశ్వరయ్య, రాందాసు, రామాంజనేయులు, లక్ష్మన్న, చంద్రకళ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : స్వాతంత్ర్య సమరయోధులు, పేదల పక్షపాతి, విప్లవకారుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాము, లక్ష్మన్న, కర్రెన్న, వెంకటమ్మ, ఖలీలమ్మ, అలివేలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, సిపిఎం మొట్టమొదటి జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య సేవలు మరువలేనివి అని సిపిఎం నాయకులు కొనియాడారు. సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో ఉన్న సిపిఎం కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఆదర్శ కమ్యూనిస్టుగా, ఆజాతశత్రువుగా పిలిచే సుందరయ్య నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయుడన్నారు. పార్లమెంట్‌లో మొదటి ప్రతిపక్షనేతగా ప్రజల మన్ననలను పొందారన్నారు. ప్రజాసేవ కోసం పిల్లలే వద్దనుకున్న త్యాగజీవి అన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్‌రెడ్డి, నాగరాజు, అంజి, శ్రీరాములు, బాల చౌడయ్య, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో సుందరయ్యకు అంజలి ఘటిస్తున్న సిపిఎం నాయకులు

బాధిత కుటుంబానికి సాయం

సాయం అందజేస్తున్న నిర్మలమురళి

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో పేద కుటుంబానికి ఆదివారం సాయం అందించారు. అనంతపురం రూరల్ సోములదొడ్డి పంచాయతీ భగత్‌సింగ్ నగర్‌లో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ నాగరాజుకు స్ట్రోక్ రావడం, పక్షవాతంతో కుడికాలు, కుడి చేయి పని చేయడం లేదు. విషయం తెలుసుకున్న నిత్యసురభి ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్. నిర్మలమురళి రూ.10వేల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పట్టం దేవర ఉత్సవం

వజ్రకరూరు : విడపనకల్ మండలం ఎన్.తిమ్మాపురం గ్రామంలో కురుబ కులస్తులు పండగ పట్టం దేవర ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కురుబ కులస్తులు ఆరాధ్య దైవాలుగా పిలుచుకునే దైవ ప్రతిమలను ఎన్.తిమ్మాపురం గ్రామంలోకి చేర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవంలో ఎంపిపి కరణం పుష్పావతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవంలో వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, ఎంపిటిసి ఓబులేసు, వైసిపి నాయకులు ప్రసాద్, భీమలింగ, ఉమాశంకర్, ధనుంజయరెడ్డి, శివారెడ్డి, సురేష్‌యాదవ్, సుంకన్న, నెట్టికల్లు, మస్తాన్, దుగ్గెన్న, శంకరయ్య, వెంకటేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవంలో పాల్గొన్న నాయకులు

తల్లిపై తనయుడి దాడి

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన నాగరత్నమ్మపై కుమారుడు ఎర్రిస్వామి ఆదివారం కొడవలితో దాడి చేశాడు. ఈ ఘటనలో నాగరతమ్మ తీవ్రంగా గాయపడింది. కుటుంబ కలహాలతో దాడి జరిగినట్లు కేసు నమోదు చేశామనిరాయదుర్గం అర్బన్ శ్రీనివాసులు తెలిపారు. ప్రస్తుతం బాధితురాలు అనంతపురంలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.